




తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా 'కౌముది' పాఠకులకి

ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

## జాతిపురోగతి కోసం తపించిన అచ్చమైన దేశీయ కథకుడు శ్రీపాద

(1891 - 1961)


శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

**తెలుగు భాషమీద,** తెలుగు జాతిమీద గొప్ప ఆపేక్ష ఉన్న కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. సంస్కృతాంధ్రాల్లో ఆయన మంచి పండితుడు. సంస్కృత విద్యల కంటే తెలుగునూ, తెలుగులోని పద్యవిద్య కంటే వచనాన్నీ శ్రీపాద ఎక్కువగా ప్రేమించారు. వచన రచయితగా కృషిచేశారు. "గ్రాంధికానికాదర్శాలు శతాబ్దాల నాటి పాతపుస్తకాలైతే, వ్యావహారికానికి మన చుట్టూ ఆవరించి ఉండిన జీవనలోకం ఆదర్శం" అని వచన రచనలో వచ్చిన ఆధునికతకు ఆహ్వానం పలికారు. "నేనేగాక జనసామాన్యమున్నూ జ్ఞానం సంపాదించుకోవాలంటే సర్వాంగణీయమైన వచన వాఙ్మయం ఎప్పుడు సంపన్నం అవుతుందో అప్పుడే నెరవేరుతుంది" అని వచన రచనావశ్యకత విషయంలో ప్రజాస్వామిక దృష్టిని చాటారు.

శ్రీపాద వచన రచనా కృషిలో ఆయన రాసిన కథలకు ఒక ప్రత్యేక స్థానముంది. కథకుడిగా వీరేశలింగం సంస్కరణ భావాలకూ, బంకించంద్రుని, బాలగంగాధర్ తిలక్, భాషా, ప్రాంతీయ, జాతీయతా భావాలకూ ఆయన సన్నిహితుడు. ఒక్క వేశ్యల విషయం తప్ప, వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమంలో భాగమైన స్త్రీ విద్యనూ, వితంతు పునర్వివాహాలనూ శ్రీపాద గౌరవించారు. బంకిం, తిలక్ ప్రభావాల వల్లా, జాతీయోద్యమంలోని దళిత సమస్యల అవగాహన వల్లా, వీరేశలింగం స్పృశించని వివిధ సమస్యల్ని శ్రీపాద తన కథల్లో చిత్రించారు. దీనివల్ల ఆయనకు విలక్షణమైన విమర్శక దృష్టి మరొక వైపు విమర్శనాత్మక వాస్తవికతా ధోరణిని కొనసాగించారు.

వితంతు వివాహం, స్త్రీ స్వాతంత్ర్యం, మూఢాచార నిరసనం, అంటరానితనం నిరుద్యోగ యువకుల అమానుషమైన పోట్న, ఉద్యోగి స్వామ్యంలోని అవినీతి.. కొత్తతరం యువతీ యువకుల నూతన వ్యక్తిత్వం, వరకట్న వ్యతిరేకత, కట్నం కోసం పీడించిన భర్తతో తెగతెంపులు చేసుకోగల ధృఢ మనస్తత్వమున్న స్త్రీ శక్తి, వేశ్యా వివాహం, బ్రాహ్మణగ్రహారాలలో సకల సాంస్కృతిక విలువల క్షైణ్యం. శాఖా, కుల మత దేశాంతర వివాహాలు - ఇలాంటి సమకాలిక సమస్యలు శ్రీపాద కథల్లో మనకు కనపడతాయి. గోదావరీ ప్రాంత గ్రామాల్లో, పట్టణాల్లో వచ్చిన సాంఘిక, రాజకీయ ఆర్థిక, సాంస్కృతిక కళారంగ పరిణామాలు నేపథ్యంగా చిత్రితమయ్యాయి.

వితంతువుల పాత్ర చిత్రణలో శ్రీపాద ఒక ప్రత్యేకమార్గాన్ని అనుసరించారు. భర్త పోయిన స్త్రీకి అండగా నిలువగల పాత్రలను ఆయన సృష్టించారు. ధీరోదాత్త పాత్రలను ఆయన సృష్టించారు. కథల్లో ఈ నూతన సంస్కారావిష్కరణను మనం గమనించవచ్చు. 'అరికాళ్ళ కింద మంటలు' కథలో కుటుంబ హింసను భరించలేని బాలవితంతువు వీరేశలింగం ఆశ్రమానికి పారిపోతుంది. ఈ కుటుంబ హింస 'ఇల్లుపట్టిన వెధవాడ పడుచు' లోనూ, 'కీలెరిగిన వాత 'లోనూ శ్రీపాద మరింత ప్రస్ఫుటంగా చిత్రించారు. 'కొత్తచూపు', అన్నంత పనీ జరిగింది' లాంటి కథల్లో పురుషాహంకారాన్ని ఎదుర్కోగల విద్యావంతుల్ని సృష్టించారు. 'యావజ్జీవం హోష్యామి', 'షట్కర్మ యుక్తా' అనే కథలు అసమ దాంపత్య జీవితాన్ని చిత్రించినవి. దాంపత్య హింస వీటిలో ప్రధాన సమస్య.

శ్రీపాద కథల్లో 'బ్రాహ్మణాగ్రహారాన్ని ఆయన చిత్రించారు. ప్రాయశ్చిత్తాలూ, శుద్ధీ వ్యాపారమైపోయిన సాంస్కృతిక కాలుష్యాన్ని శ్రీపాద విమర్శించారు. అనాచారం, అంతఃకలహాలూ, వంచనా, కూటనీతీ విలువ పతనంగా ఎత్తి చూపాడు.

'ఇలాంటి తవ్వాయి వస్తే' అనే కథలో శ్రీపాద అస్పృశ్యులైన వారి మతం మార్పిడిని, అగ్రవర్ణ దురహంకారాన్ని సవాలు చేయగల మతం మార్పిడిని చిత్రించారు. క్రైస్తవ మతం ఇవ్వలేని సామాజిక ప్రతిపత్తిని అస్పృశ్యులకు ఇస్లాం ఇవ్వగలిగిన స్థితిగతులను ఈ కథలో చిత్రించారు. అగ్రవర్ణాల అమానవీయ దురహంకారాల్నీ, మతాధికారుల, సంఘసేవకుల, రాజకీయ నాయకుల వంచనా వైఖరులనూ విమర్శించాడు. గురజాడ మీ పేరేమిటి కథ, ఇలాంటి తవ్వాయి వస్తే కథకు ప్రేరణ అవునో కాదో చెప్పలేం. కానీ గురజాడ విమర్శక ధోరణి ఈ కథలో వ్యంగాత్మకంగా కనిపిస్తుంది. గురజాడ మత బేధాలనూ, మత శాఖా వైరుధ్యాలనూ చిత్రిస్తే, శ్రీపాద ఇంకొంచెం ముందుకు వెళ్ళి కుల వైషమ్యాలనూ, దళిత చైతన్యాన్నీ చిత్రించారు.

'తాపీ మేస్త్రీ', 'రామ దీక్షితులు బి.ఎ.' 'కలుపు మొక్కలు', 'గుర్రప్పందాలు,' 'మార్గదర్శి' నిరుద్యోగుల అగచాట్లను చిత్రించిన కథలు. ఈ కథల్లో మనల్ని కలవరపరిచే కథ గుర్రప్పందాలు. ఇంటర్వ్యూల భాగోతం విప్పి చూపిన కథ ఇది. పెళ్ళికొడుకు పెళ్ళి కూతుర్ని చూసుకునేప్పుడు ప్రదర్శించే హింసలాంటిదే ఇంటర్వ్యూల హింస. మనుష్యుల్ని జంతువులుగా చేసే అమానుషం ఈ కథలో చిత్రమైంది.

శ్రీ పాద 75 కథల వివరాలు మనకు ఇప్పుడు లభిస్తున్నాయి. వీటిలో కొన్ని చారిత్రిక కథలు. పూర్వ సంస్థాన కథలు. జానపద కథలు కూడా చోటు చేసుకున్నాయి. చారిత్రిక నేపథ్యం కలిగిన కథల్లోని చారిత్రిక వాస్తవికత కంటే, సాంఘిక కథల్లో ఎక్కువ సామాజిక దృష్టిని కనపరిచారు. వాస్తవ చిత్రణ చేశారు. వ్యక్తుల ప్రాంతీయ సామాజిక నేపథ్యాలను వివరంగా తెలిసిన మొదటి కథకుడు శ్రీపాద అని చెప్పవచ్చు. పాత్రల ప్రాంతం, మతం, శాఖ, కులం, ఇంటిపేరు ఈ వివరాలు తెలియడం వల్ల కథాకాలం నాటి సామాజిక నిర్మాణ స్వరూపం మనకు అవగతమవుతుంది.

కథా శిల్పంలో శ్రీపాద కొన్ని అపూర్వమైన ప్రయోగాలు చేశారు. రచయిత కథన జోక్యం అసలు లేని సంవాదాత్మక నాటికీయ పద్ధతిని కొన్ని కథల్లో ప్రవేశపెట్టాడు. 'కలుపు మొక్కలు' నాటకీకరించిన కథ. ఈ కథను ఈ విధంగా నాటకీకరించడం వల్ల ఈ కథలో కలుపు మొక్కలు వేశ్యాలోలుడైన జిల్లా బోర్డు ప్రెసిడెంటో, ఆట బొమ్మగా మారిన వేశ్యో, ఆమె సాయంతో ఉద్యోగం సంపాదించాలనుకున్న అవధానో, అందరో రచయిత ఎక్కడా చెప్పరు. ఒక హీన సమాజ చిత్రణ ఈ కథలోని సంవాద రూపంలో మనం చూస్తాం. శ్రీపాద ఇతర కథల్లో కూడా సంవాద ధోరణి ఎక్కువ. శ్రీపాదకు సంస్కృత నాటకాలు పరిచయం. స్వయంగా నాటకాలు రాశారు. ఆడారు. ప్రేక్షకుల మీద సంవాద కౌశల ప్రభావం ఆయన అనుభవంలో ఉంది. ఇతివృత్తి వికాసానికీ, పాత్రోన్మీలనకూ, పాఠక మనోచాలనానికి సంవాద పద్ధతి ఒక మంచి మార్గమని శ్రీపాద భావించారు.

భాషా శైలి విషయంలో శ్రీపాదది వాడుకకు దగ్గరగా ఉండే జీవద్వంతమైన శైలి. వాక్యనిర్మాణం, వాక్యాల విరుపులతో సహా వాడుకకు అతి సన్నిహితం. కథన శైలిని తన వర్గ మాండలికం నుంచి ఆయన అందిపుచ్చుకుని ఉండవచ్చు. పాత్రల శైలుల్ని ఇతర వర్గమాండలికాలకు సన్నిహితంగా కూడా ఆయన వాడారు.

శ్రీపాద కథల పరిమాణం గురించి కూడా కొన్ని మాటలు మాట్లాడుకుందాం. శ్రీపాద దృష్టిలో చిన్న కథ ఆత్మను బట్టి ఉంటుంది. పరిగణనను బట్టీ కాదు. చెప్పడానికి వాక్శుద్ధీ, వినిపించడానికి నేర్పూ, బోధపరచటానికి ఎంతో సంస్కారమూ ఉండాలని ఆయన అంటారు. అంటే కథా పరిమాణం శ్రీపాద దృష్టిలో అతిముఖ్యం కాదు. కథాలక్ష్యం ముఖ్యం. ఆయన కొన్ని కథలు చిన్న నవలలంత పరిమాణం ఉంటాయి. ఉదాహరణకు తల్లి ప్రాణం అనే కథ 1/8 డెమీలో 63 పేజీలు సాగిన రచన. అంటే ఉజ్జాయింపుగా పదిహేడువేల పదాలు దాకా సాగిన కథ. కథ శ్రీపాద దృష్టిలో చెప్పేదీ, వినిపించేదీ. అంటే పాఠక ప్రధానమూ, శ్రోత్రుప్రధానమూ చదివేటప్పుడు శబ్ద శక్తిని వినగల మాటల నైపుణ్యం కథలో ఉండాలని శ్రీపాద ఉద్దేశం. ఆయనది దేశీయ కథా కథన పద్ధతి. కొడవటిగంటి కుటుంబరావు మాటల్లో చెప్పాలంటే "శాస్త్రిగారి రచనలకు చిన్న కథ, పెద్ద కథ, నవల అన్న మాటలు వాడటం అనవసరమేమో. వాటి శిల్పాలను ఆయన ఏనాడూ పట్టించుకోలేదు. మనం టెక్నిక్ అనేది పాటించలేదు. ఆయన దృష్టిలో రచన చేయడమంటే ఒక విందు భోజనం సిద్ధం చెయ్యటం లాంటిది. అందులో ప్రతిమాటా, ప్రతివాక్యమూ, ప్రతి వివరమూ రుచ్యంగా ఉండాలి. ఆంగ్ల మానసపుత్రులు రాసిన సాహిత్యం కన్నా ఆయనది విలువలైనది." ప్రధాన ఘటనల మీదకన్నా, సన్నివేశ కల్పన మీదా, ఉపాఖ్యానాల మీదా శ్రీపాదకు దృష్టి ఎక్కువగా ఉండడం వల్ల, ఆయన దేశీయ కథా కథన పద్ధతితోపాటు, నాటకీయ పద్ధతిని కూడా అనుసరించారు.

శ్రీపాదకు ఇంగ్లీషు రాకపోవచ్చు. ఇంగ్లీషు ద్వారా దొరికే యూరోపియన్ కథా శిల్పపరిచయం లేకపోవచ్చు. మరి ఆయన కథలకు ప్రసిద్ధి ఎందుకు వచ్చినట్టు? 20 వ శతాబ్దిని ప్రభావితం ఏ రకంగా చెయ్యగలిగారు?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆయన ఆధునిక భాషా సంస్కారంలో కనిపిస్తాయి. సాహిత్య సంస్కారంలో గోచరిస్తాయి. పాత్రలను మనముందుంచగల భిన్న భాషా శైలుల నిర్మాణ సామర్థ్యం ఆయనకుంది. పలుకుబళ్ళలోని సూటిదనమూ, సారళ్యమూ, పదునూ ఆయన శైలీ లక్షణం. ఇది ఆయన భాషా సంస్కారం. నిజాయితీతో కూడిన లోక వృత్త పరిశీలనం, కథన కౌశలం, తెలుగు జాతీయత, తెలుగు సంస్కారం సంస్కరింపబడాలనే బలీయమైన ఆకాంక్షా ఆయన సాహిత్య సంస్కార లక్షణాలు.

గురజాడ తదనంతర తరంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి తెలుగు జాతికథకుడు. ఆయన తన కథలో సాధించిన వాస్తవికత తెలుగులో వాస్తవికతా వాదం బలపడడానికి దోహదం చేసింది. కథా సాహిత్యంలో అభ్యుదయోద్యమం తల ఎత్తడానికీ, బలపడడానికీ శ్రీపాద కథా సాహిత్యం దోహదపడింది.